# ఆస్పత్రి

– జయప్రద

అదిగో! ఆ కనపడేది గవర్నమెంట్ హాస్పటల్. హుందాగా, అందంగా, స్టేత్‌లు ఎవరో సన్మానం చేసి వేసిన పూలహారాల్లా మెళ్ళో తగిలించుకుని, చేతుల్తో ఊపుకుంటూ కార్లలో, స్కూటర్లలో దిగుతున్నారు డాక్టర్లు ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే కొంగల్ని పట్టుకుని రెక్కలు కత్తిరించి గొలుసు వేసినట్టు కేర్లెస్‌గా తిరిగేస్తున్నారు సిస్టర్లు.

ఓ. పి. మొదలైంది. పవిత్ర భారత పౌరులు రోగాలతో నిండిన శరీరాల్ని బాగు చేసుకోనూ లేక వాటిని విడవనూ లేక శాపగ్రస్తుల్లా బెంచీల మీద కూర్చున్నారు. రోగాలకీ శరీరాన్ని విడవ బుద్ధి కావటం లేదు; ప్రాణాలకీ శరీరం మీది మమకారం చావల్లేదు. తప్పని సరిగా శరీరాలు ప్రాణాల్ని నిలుపు కుంటున్నాయి.

అల్లదిగో! అక్కడ టేబుల్ దగ్గర కూర్చున్న సిస్టర్ అసహ్యంగా అసహనంగా పవిత్ర భారత పౌరుల వంక చూస్తూ టిక్కెట్టు – సారీ – చీటీ ఇస్తోంది. (స్వర్గానికో, నరకానికో మనకి తెలీదు)

లోపల కుషన్ చైర్లో ఠీవిగా కూర్చోలేక పోతున్నాడు కుర్ర డాక్టరు. అతను సిస్టర్ కంటె అసహ్యంగా, అసహనంగా వారికేసి చూస్తున్నాడు. చీటీ తీసుకుని రోగమేమిటో అడక్కుండానే మందులు రాసేస్తున్నాడు. (ఆ మందు లేమిటో ఇచ్చే వాళ్ళకే తెలుస్తాయి. మనకి తెలీదు, ఎందుకంటే మనం ఐదు సంవత్సరాలు "కష్టపడి" ఆ మహా గొప్ప పవిత్ర విద్యని చదువ లేదుగా!) ఇంతలో ఒక దాదస్తుడు "అయ్యా" అని ఏదో చెప్పబోయాడు. మూర్ఖుడు, "ఊఁ సర్లే వెళ్ళు" అన్నాడు కుర్రడాక్టరు కళ్ళు చిట్లిస్తూ.

ఆ తర్వాత దాదస్తుడు "అయ్యా సూదేసించండి. నాల్రోజుల్నుంచి వస్తన్న. తగ్గట్లేదు." అన్నాడు గబగబ ఎక్కడ తోసేస్తారో నన్నట్టు.

"ఊఁ సర్లే. సూదులు, మందులు స్టాక్ లేవు. ప్రైవేట్ డాక్టర్ దగ్గరకెళ్ళు" అన్నాడు చాలా అనీజీ ఫీలవుతూ (మూర్ఖులు! ఇన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ పెట్టింది ప్రజాసేవకే గదా! ఇదంతా ఎవరికోసం? అహఁ ఎవరికోసం అని! వీళ్ళకోసం కాదా? అరె అర్థం చేసుకోరేం?)

ఆ తర్వాత ఒక భారత నారీమణి ఆమెకు ఒంటినిండా గుడ్డలేదు. కంటి నిండా నిద్ర

లేదు కడుపునిండా తిండిలేదని బాగా లోతుకు పోయిన కళ్ళు, పొట్టా చెప్పక చెప్తున్నాయి.

నలుగురికి ఒకళ్ళనన్నా కన్నెత్తి చూడక పోతే బాగుండదని యథాలాపంగా చూసిన కుర్ర డాక్టరు "నువు పళ్ళు పాలూ బాగా తాగాలి తినాలి" అన్నాడు. ఆమె పేలవంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. అది చూసిన కుర్ర డాక్టరు మొహం వివర్ణమైంది.

ఆ తర్వాత ఒక గర్భిణీ స్త్రీ. "నేషనల్ డిసీజ్" అన్నాడు పక్కనున్న డాక్టరమ్మ వంక చూసి నవ్వుతూ. "అటు వేపు" అని ఆమెకి డైరెక్ట్ చేసి యాంత్రికంగా మరో చీటీ మీద ఏదో రాసేడు.

లేడీ డాక్టర్ ఫారిన్ నైలెక్స్ చీరలో మెత్తగా మెరిసి పోతోంది. ఆమె కాళ్ళ చెప్పుల ఖరీదు చెయ్యదు ఆ గర్భిణీ స్త్రీ జీవితం మొత్తం.

"లోపలకి పద" అంది మొహం అదోలా పెట్టి పరీక్ష చేసి "ఇవ్వాళో రేపో పురుడొస్తుంది ఇదెన్నో కాన్పు?" అంది ఆమె ఏదో చెయ్యరాని పని చేసినట్టు ఫీలవుతూ.

"ఆరోది" అందామె తాను నిజంగానే తప్పుచేసినట్టు.

"ఈ సారైనా ఆపరేషన్ చెయించు కుంటావా? ఇంకా కంటావా" అంది అక్కడికి తన సొమ్మేదో పోతున్నట్టు (ఈ డాక్టర్లు ఇంజెక్షన్లు స్మూత్‌గా చెయ్యలేరు. ఆపరేషన్లు సరేసరి — మాటలు కూడా స్మూత్‌గా రావా?)

"చేయించు కుంటానమ్మా" అందామె దీనంగా, దిగులుగా.

"సర్లే. పద. జాయినయిపో." అంది కేర్లెస్‌గా లేడీ డాక్టర్, కుర్రడాక్టర్ ఒక ముసలివాడికి మందులు రాస్తూ ముక్కు చిట్లించాడు. అదిచూసి. లేడీడాక్టర్ నవ్వింది సుతారంగా. హుందాతనంలో వయ్యారం రంగరించి నడుస్తూ వచ్చి కూర్చుంది ఆమె. ఫారిన్‌చీర మడతల్లో దాసిన పారిస్ సెంటు కుర్చీళ్ళ కదలికకి లలిత లలితంగా వచ్చి కుర్ర డాక్టర్ నాసికా పుటాలకి సోకింది. "థాంక్స్" అన్నట్టు ఆమె వంక చూసి నవ్వేడు అతను.

ఆ తర్వాత ఒక భావి భారత పౌరుడు. వాడికి వంటినిండా గజ్జి. పుళ్ళు.

"ఇంకా ఎంత సేపు?" అన్నట్టు అసహనంగా కుర్చీలో కదిలింది లేడీ డాక్టర్.

"కొండపీటి చేంతాడు" అన్నాడు కుర్ర డాక్టర్ ఆమె బాధని గ్రహించినట్టు.

"ఆంజనేయుడి తోక" అంది లేడీ డాక్టర్ ముద్దుగా.

"అమ్మో అబ్బో! వీళ్ళకి ఆంజనేయుడి గురించి తెలుసే! అవున్లే ఎంతయినా పవిత్ర భారతదేశంలో పుట్టి. భారతీయ సంస్కృతిని జీర్ణించుకున్న వాళ్ళాయె మరి. ఎంత ఎమ్. బి. బి. ఎస్‌లు చదివినా వాళ్ళు ఈ భూమిలో పుట్టిన వాళ్ళేగా?)

అప్పటికి వాళ్ళు ఓ. పి. లో కూర్చుని కనీసం అరగంట కూడా కాలేదు. అందర్నీ చూశామనిపించారు వాళ్ళిద్దరూ కలిసి.

ఫ్లాస్కు తీసి కాఫీ గ్లాసుల్లో ఒంపి ఒకటి ఆమెకిచ్చాడతను దైవానికి నైవేద్యం పెడుతున్నంత భక్తిని ఫీలవుతూ. ఆమె దేవతలా ఓ అపురూపమైన చిరునవ్వుని పారేసి కాఫీ సిప్ చేయసాగింది.

"అబ్బ. ఈ లేబర్‌ని భరించటం చాలా కష్టం" అన్నాడు అసహ్యంగా మొహం పెట్టి.

"యస్, నాస్టీ" అంది లేడీ డాక్టర్ కూడా వీలయినంతవరకూ అసహ్యంగానే

మొహాన్ని పెట్టి.

"ఛీ, ఈ దేశమంటేనే అసహ్యం పుడుతోంది. ఛాన్స్ తగిలితే స్టేట్స్‌కి పోదామనుకుంటున్నాను." అన్నాడు కుర్రడాక్టర్.

"అవును అది చాలామంచిది" అంది లేడీ డాక్టర్ తాను కూడా అదే ప్రయత్నంలో ఉన్నానన్నట్టు.

(అమెరికాలో లేబరుండరేమో. ఒకవేళ ఉన్నా వాళ్ళు ఎర్రగా కేరట్ దుంపల్లా ఉంటారుగా. వాళ్ళకి చెయ్యొచ్చు సేవ!")

ఆ రాత్రి ఆ గర్భిణీ స్త్రీని లేబర్ రూమ్‌కి తీసుకెళ్ళారు. బల్లమీద పడుకోబెట్టారు. సిస్టర్లు యథాప్రకారం అసహ్యంగా మొహాలు పెట్టి ఏదో అనర్థం జరగబోతున్నట్టు అనీజీగా ఫీలవసాగారు. ఆమె పెట్టే కేకలకి వాళ్ళు నవ్వుకుంటున్నారు. వయసులో కాస్త పెద్దదైన సిస్టర్ "అరుస్తావేం! అయిదుగుర్ని కన్నావుగా!" అని కసిరింది. (అయిదుగుర్ని కంటే ఆరో బిడ్డ నొప్పుల్లేకుండా పుడుతుందేమో సిస్టర్‌కే తెలియాలి.")

"అమ్మో. నా ప్రాణం పోతోంది" అని అరిచిందామె.

"ప్రాణం పోతోందా! అపుడేమయిందీ ఇది" అని నవ్వసాగారు సిస్టర్లు.

(తెల్లటి గౌన్లూ, కోట్లూ వేసుకోగానే సరికాదు తెలుపు దేనికి చిహ్నమో తెలుసా అని! కారుణ్యానికీ, సేవానిరతికీ. అని తెలియదు వీళ్ళకి నిజంగా.) అంత బాధలో కూడా ఆ వ్యంగ్యం ఆమెని వాడిగా తాకింది. వేడిగా కన్నీళ్ళు చిందేయి. బయట కూర్చున్న ఆమె తాలూకు ముసలమ్మ ఆమె కేకలకి నిలవలేక లోనికిరాబోతుంటే రానీయలేదు సిస్టర్లు.

* * *

ఇంతలో గేట్లోంచి కారొకటి దూసుకొచ్చింది. ఇంపాలా తళతళల్లో తమనీడలు చూసుకోటానికి బయటకి పరుగెత్తారు సిస్టర్లు.

కార్లో వచ్చినామె కూడా ప్రసవవేదన పడుతోంది. అప్పటికప్పుడు ఆమెని స్పెషల్ వార్డులో ప్రవేశపెట్టారు. క్వార్టర్సులో ఉన్న లేడీ డాక్టరు పరుగెత్తుకొచ్చింది.

"హలో!" అంటూ పలకరించి గబగబ పరీక్ష చేసింది. కొంచెం కంగారుపడి గబగబా బల్లెక్కించింది. బల్లమీద పడుకోలేనంటూంటే మళ్ళీ మంచంమీదే పడుకోబెట్టింది ఫోన్‌చేసి పెద్దడాక్టర్‌కి చెప్పింది. ఫలానా వాళ్ళ తాలూకుకి సిజేరియన్ చెయ్యాల్సి వస్తుందేమోనని తొందరగా రమ్మనీ, కుర్రడాక్టరుకి కూడా ఫోన్ చేసింది.

హాస్పిటలంతా హడావిడిలో మునిగిపోయింది. ముగ్గురు డాక్టర్లూ కలిసి ఆపరేషన్ జయప్రదంగా ముగించి షేక్‌హాండిచ్చుకున్నారు.

తెల్లవారి, ఆ రాత్రి ప్రసవవేదన పడలేక వాతం కమ్మి చచ్చిపోయిన సదరు పవిత్ర భారత సగటు మహిళ భావాన్ని చూచి గొల్లుమన్నాయామె తాలూకు జీవచ్ఛవాలు.

"ష్. ఏడవకూడదు. తొందరగా తీసుకుపోండి" అంటూ కేకలేశారు సిస్టర్లు (హా! పవిత్రభారత జననీ! నీ గడ్డమీద పుట్టిన పుణ్యానికి చచ్చినా ఏడవకూడదు కదా!)

